సాక్షి ఒడిశా

మంగళవారం | 6 | ఆగస్టు | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4.08.013
బంగారం	200 మిల్లీ గ్రాములు
వెండి	24 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

విజిలెన్స్ వలలో చీఫ్ ఇంజినీర్



ఒడిశా వంతెన నిర్మాణ సంస్థ కటక్ సర్కిల్ అదనపు చీఫ్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ రథ్ అక్రమ ఆస్తులపై ఒడిశా విజిలెన్స్ సోమవారం సోదాలు చేపట్టింది.

- 8లో



గ్రీవెన్స్‌కు విశేష స్పందన

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

- 8లో

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాయగడ: ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర మండపంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రేజేటి శ్రీనివాస్ శర్మ రెండోసారి ఎంపికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా ఎ.నారాయణమూర్తి, సాధారణ కార్యదర్శిగా కె.సూర్యనారాయణ, కోశాధికారిగా పి.సీతారామమూర్తిలు ఎంపికయ్యారు. వీరితో పాటు మరో 21 మంది కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లు కొనసాగుతుంది.

హులువాలో మొక్కల పంపిణీ



మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మనోజ్ తదితరులు

రాయగడ: సదరు సమితి హులువా పంచాయతీ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ పాల్గొన్నారు. వివిధ రకాల మొక్కలను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా ఔషధ మొక్కల పంపిణీ చేయాలని, అవసరానికి ఎంతగానో ఉపయోగపడే వాటి ఆవశ్యకత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు ఈ సందర్భంగా ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో తమ సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో హులువ పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి అటవీ ప్రాంతం దొరాగుడ గ్రామంలో సోమవారం ఉదయం ఒక కొండ చిలువ కలకలం సృష్టించింది. గ్రామంలోని కొంతమంది రైతులు తమ పంట పొలాలకు వెళ్తున్న సమయంలో కొండచిలువ కనిపించింది. అది ఏదో జంతువును మింగి ఎటూ కదలలేని స్థితిలో ఉండడంతో చాకచక్యంగా పట్టుకొని గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం అటవీ విభాగ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్టర్ లలిత హరిజన్ వచ్చి కొండ చిలువను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సురక్షితంగా అడవి ప్రాంతంలో విడిచిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన భక్తుడు సునాధర్

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్‌లో మహాశివుడిని దర్శించుకోవడానికి వచ్చి ఒక బోల్ భం భక్తుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం శివ లింగానికి పవిత్ర జలాభిషేకం చేసేందుకు గుప్తేశ్వర్‌కు కావిడితో నడిచి వెళ్తున్న భక్తుడిని వెనుక నుంచి వస్తూ ఒక బైక్ ఢీకొంది. బొయిపరిగుడ–గుప్తేశ్వర మార్గం దొలాపూర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన భక్తుడు సునాబెడ డ్రైవర్ కాలనీకి చెందిన సునాధర బాగ్‌గా గుర్తించారు. ప్రమాదంలో అతడి కుడి కాలు విరిగిపోగా, తలకు బలమైన గాయాలైనట్లు తెలుస్తోంది. వెంటనే అక్కడ ఉన్నవారు అతడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సాహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపే వ్యక్తికూడా గాయపడగా, అతడిని బొయిపరిగుడ ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి బైక్ సీజ్ చేసినట్లు తెలుస్తోంది.



పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- శ్రీమందిరం ప్రసాద విక్రయాలపై పటిష్ట చర్యలు
- పాలక మండలి సమావేశంలో పలు నిర్ణయాలు
- రత్న భాండాగారం మార్గదర్శకాలకు ఆమోదం



ఒబొడో మహా ప్రసాదం

గుర్తింపు కార్డుల జారీ...

మూతబడేనా అక్రమాల దారి..!



పూరీ జగన్నాథ ఆలయం

భువనేశ్వర్:

శ్రీమందిరం సముదాయంలోని ఆనంద బజార్ ప్రాంగణంలో చేపడుతున్న మహా ప్రసాదాల విక్రయాల్లో చోటు చేసుకుంటున్న అక్రమాల నివారణకు పటిష్టమైన కార్యాచరణకు పాలక మండలి నడుం బిగించినట్లు శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు. పూరీ గజపతి మహారాజా అధ్యక్షతన పాలక మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మహారాజా దివ్యసింగ్ దేవ్ వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఈ మేరకు సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. నిబంధనల మేరకు ప్రసాదం విక్రేతలకు గుర్తింపు కార్డుల జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివలన అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. అలాగే దకాణాల కేటాయింపు, ధరల పట్టిక ప్రదర్శన వంటి చర్యలతో ప్రసాదాల అమ్మకాల్లో అవకతవకలను తొలగించనున్నారు. శ్రీమందిరం సింహ ద్వారం పోలీసు థాణా ఆధునికీకరణ ప్రతిపాదనను సైతం పాలక మండలి పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రకటించారు.

రత్న భాండాగారం ఎస్‌ఓపీకి ఆమోదం

అదేవిధంగా ఆలయంలో స్వామివారి నగలు, ఆభరణాలు భద్రపరిచే రత్న భాండాగారం పరిశీలన బృహత్కార్యాచరణగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ అంచెలంచెలుగా సమయానుకూల మార్గదర్శకాలతో కొనసాగుతుందని ఇటీవల రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షణ ఉన్నత స్థాయి కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్ తెలిపారు. ఆయన అధ్యక్షతన రత్న భాండాగారం వెలుపలి, లోపలి రెండు గదులను తెరిచి వాటిలో నగలు, ఆభరణాలను సురక్షితంగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన విషయం తెలిసిందే. దీంతో రత్న భాండాగారం పూర్తిగా ఖాళీ అయింది. దీని నిర్వహణ, మరమ్మతులు, ఇతరేతర అనుబంధ కార్యకలాపాల కోసం బాధ్యతలను భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ)కి అప్పగించారు. అయితే ఏఎస్‌ఐ ఆధ్వర్యంలో ప్రాచీన ఆలయ కట్టడానికి ఏమాత్రం భంగం కలగకుండా రత్న భాండాగారం నిర్వహణ పనులను చేపట్టాలని తనిఖీ ఉన్నత స్థాయి కమిటీ నిర్దిష్ట కార్యాచరణ(ఎస్‌ఓపీ) ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను శ్రీమందిరం పాలక మండలి ఆమోదించింది. ఈ నేపథ్యంలో పాలక మండలి తీర్మానం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోసం సిఫారసు చేస్తారు.

సులభ దర్శనం

అలాగే భక్తులకు సజావుగా దర్శనం కల్పించేందుకు పలు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పూరీ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్‌తో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తారు. కమిటీ వివిధ సేవాయత్ సంస్థలతో సంప్రదిస్తుంది. ఈ సంప్రదింపులతో దర్శన విధానంలో సంస్కరణలను సమీక్షించిన మేరకు సులభ దర్శనం ఏర్పాట్ల కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందన్నారు.

భూ నిబంధనల ముసాయిదాకు ఆమోదం

శ్రీజగన్నాథ దేవాలయం భూముల నిబంధన నియమాలు – 2024 ముసాయిదాకు పాలక మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత అమలు చేయడం జరుగుతుందని వివరించారు. అబఢ (ఆగ్మెంటేషన్ బేసిక్ ఎమ్యునిటీస్ అండ్ డవలప్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ అండ్ ఆర్కిటెక్చర్) పథకం కింద ఒడిశా వంతెన నిర్మాణ సంస్థ(ఓబీసీసీ) శ్రీమందిరానికి 35 ఏసీ ఈ–బస్సులను అందజేసింది. వీటి నిర్వహణ మార్గదర్శకాల ఖరారు పాలక మండలి సమావేశంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఓఎస్‌ఆర్‌టీసీ వంటి అనుభవజ్ఞ సంస్థకు నిర్వహణ బాధ్యతలను బదిలీ చేయాలని పాలక మండలి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

పారదర్శకంగా సిబ్బంది నియామకం

శ్రీమందిరం పాలన వర్గాల కింద సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఆమోదంతో ఆలయ కార్యాలయం గమాస్త, రక్షణ సిబ్బంది ఇతరేతర ఉద్యోగాల్లో ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని పాలక మండలి డిప్యూటీ సీఏఓ, పూరీ జిల్లా కలెక్టర్ సమావేశంలో ప్రతిపాదించారు. సిబ్బంది భర్తీ ప్రక్రియ నిర్వహిస్తున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), సబార్డినేటు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి ప్రభుత్వ అధీకృత సంస్థల ఆధ్వర్యంలో భర్తీ చేయాలని పాలక మండలి ప్రతిపాదించింది. సిబ్బంది నియామకం నియమ నిబంధనలు ఇతరేతర అనుబంధ మార్గదర్శకాలను ఖరారు చేసి ఆయా సంస్థల ఆధ్వర్యంలో పారదర్శకంగా సిబ్బందిని నియమించాలనేది పాలక మండలి యోచనగా సీఏఓ పేర్కొన్నారు.

గంజాయి కేసు ఛేదించిన పోలీసులు

- ఐదుగురు నిందితులు అరెస్టు



ఆనంద సుత



చొబి నాయక్



వినోద్ కుమార్ హరిజన్



గణేష్ జాని



నాగ్ ఉరఫ్ నేపక్

జయపురం: ఒక కారులో గంజాయి అక్రమంగా రవాణా చేసిన కేసును పోలీసులు ఛేదించారు. జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ చంద్ర తండి తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీ రాత్రి పోలీసులు ఉమ్మిరి సమీపంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఒక నంబర్ లేని కారు రావడం గమనించి ఆపమని సూచించారు. దీంతో కారుని వదిలి డ్రైవర్, అందులో ఉన్నవారు పరారయ్యారు. అనుమానం వచ్చి పోలీసులు కారులో సోదాలు చేయగా గంజాయి బయటపడింది. కారులో ఉన్న 60 కేజీల గంజాయితో పాటు కారు సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు సోమవారం వెల్లడించారు. అరెస్టైనవారిలో కోట్‌పాడ్ సమితి శంకరడ గ్రామానికి చెందిన ఆనంద సుత, బొడొదువా సాహికి చెందిన ఛొబి నాయిక్, వినోద్ కుమార్ హరిజన్, బొండాగుడ గ్రామానికి చెందిన గణేష్ జాని, ఉమ్మిరి గ్రామానికి చెందిన నాగ్ ఉరఫ్ నేపక్‌లు ఉన్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచామని, బెయిలు లభించకపోవడంతో జైలుకు తరలించినట్లు వెల్లడించారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట



అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి కిడిగాం గ్రామంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముఖ్య అతిథిగా విచ్చేసి సోమవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. కాశీనగర్ సమితి కేంద్రం ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రజా ప్రతినిధుల అతిథి గృహాన్ని సైతం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, జెడ్పీటీసీ రొక్కం రాజ్యలక్ష్మి, సర్పంచ్ ఆర్.రజని, సమితి సభ్యుడు బి.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని ఎదురు చూడక..!

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడక తమ వీధికి వెళ్లే బురద రహదారికి తామే మరమ్మతులు చేసుకున్న ఘటన జయపురంలోని పటనాయిక్‌గుడ వీధిలో సోమవారం చోటుచేసుకుంది. ఆ వీధికి కొన్నేళ్లుగా బురద రోడ్డు తప్ప శాశ్వత రోడ్డు లేదు. అందువలన గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే వారు పడే బాధలు వర్ణనాతీతం. దీనిపై ఎంతోమంది నాయకులు, అధికారులకు ఎంతో కాలంగా విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో వీధిలోని యువకులు, ప్రజలు ఏకమై గ్రావెల్ తీసుకొచ్చి తామే మరమ్మతులు చేసుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

– జయపురం



రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

పర్లాకిమిడి:

గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ గండాహతి పంచాయతీలోని ఐదు ఆదివాసీ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశామని గండాహతి సమితి సభ్యుడు ఉత్సవ్ శొబోరో తెలియజేశారు. రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో రోగులు, బడికి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.



గండాహతి నుంచి లుమ్డాసింగి రోడ్డు పరిస్థితి



వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన గ్రామస్తులు

అర్పణం అయోమయం

- నిరుపయోగంగా సేకరణ బియ్యం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ దేవస్థానం వారసత్వ ప్రాకార పథకాన్ని గత ప్రభుత్వం బిజూ జనతా దళ్ అత్యంత అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే కోట్లాది రూపాయుల ఈ భారీ పథకం ఆది నుంచి పలు వివాదాలను ఎదుర్కొంది. తాజాగా ఈ పథకంలో భాగంగా సేకరించిన బియ్యం విషయం తీవ్ర కలకలం రేపుతోంది. శ్రీమందిరం హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి ముందు అర్పణ్ రథాలు రాష్ట్రమంతటా తిరిగి ఈ బియ్యం సేకరించాయి. ఇప్పుడు ఈ బియ్యం నిరుపయోగమయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. రథాలకు భావోద్వేగంతో భక్తులు స్వచ్ఛందంగా బియ్యం, టెంకాయలు, తమలపాకులు, వక్క వంటి పదార్థాలు సమర్పించారు. వీటిని ప్రాజెక్టు ప్రారంభోత్సవ యజ్ఞంలో వినియోగించాలనే యోచన ఫలప్రదం కాలేదు.

ప్రభుత్వానిదే తుది నిర్ణయం

అయితే ప్రస్తుతం ఈ సందిగ్ధ పరిస్థితి నుంచి బయటపడేందుకు శ్రీమందిరం పాలక మండలి యోచిస్తోంది. దీనిలో భాగంగా సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు చర్చించి, స్వామివారి సేవలో నిమగ్నమైన వివిధ వర్గాల నియోగులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనను సమర్పించాలని నిర్ణయించారు. ఈ సంప్రదింపుల బాధ్యతలను శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి, పూరీ జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. వీరి నివేదిక ఆధారంగా పాలక మండలి ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం ఆమోదానికి సిఫారసు చేస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపడతారు. ఇదివరకు అర్పణ్ బియ్యం వినియోగంపై స్పందించిన రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ 'అర్పణ రథం' ద్వారా సేకరించిన బియ్యం వినియోగానికి పనికిరావని పేర్కొన్నారు. దేవతలకు కూడా సమర్పించలేమని తేల్చి చెప్పారు. ఆలయ పాలక మండలిలో చర్చించిన తర్వాత ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.



అర్పణ్ రథం సందర్శన పురస్కరించుకుని బియ్యం సమర్పిస్తున్న భక్తులు

14 వేల క్వింటాళ్ల బియ్యం సేకరణ

మహాసువార్ నియోగుల సంఘం కార్యదర్శి నారాయణ్ మహాసువార్ సమాచారం ప్రకారం జనవరి 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అర్పణ్ రథాలు సందర్శించాయి. రాష్ట్రవ్యాప్తంగా భక్తుల నుంచి సమగ్రంగా 14,000 క్వింటాళ్ల బియ్యం సేకరించాయి. వీటిలో నామమాత్రంగా 4,000 క్వింటాళ్లు మాత్రమే వినియోగించారు. ఇటీవల కాలంలో బియ్యం నాసిరకంగా మారాయి. వీటిని పేదలకు పంపిణీ చేయాలని పాలక మండలికి ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.



రాష్ట్రమంతటా సందర్శించిన అర్పణ్ రథాలు

క్లుప్తంగా

మూల విరాట్‌లకు ఖొసాపాడా

● సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో మూల విరాటులకు శ్రీఅంగ రక్షణ సేవ (ఖొసాపాడా) సోమవారం నిర్వహించారు. ఆలయ ఆచారం ప్రకారం ప్రతిపద తిథి పురస్కరించుకుని ఈ సేవ చేపట్టారు. ఏడాదిలో 2, 3 సార్లు ఈ సేవ నిర్వహిస్తుంటారు. గోప్యంగా నిర్వహించే సేవ కావడంతో భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేశారు. ద్వితీయ భోగ మండప సేవ తర్వాత ఖొసాపాడా సన్నాహాలు ప్రారంభించారు. సాయంత్రం 5.05 గంటల నుంచి ప్రారంభమైన ఖొసాపాడా ప్రక్రియ, రాత్రి 8.10 గంటల వరకు నిరవధికంగా కొనసాగింది. దైతపతుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ సేవ జరుగుతుంది. దారు విగ్రహాల సంరక్షణలో భాగంగా ఖొసాపాడా సేవ నిర్వహిస్తారు. రథయాత్ర పురస్కరించుకుని రథాలపైకి ఎక్కించి, దించడంలో దెబ్బ తిన్న శ్రీఅంగ సంరక్షణ కోసం శ్రావణ మాసం ప్రతిపద తిథి నాడు నిర్వహించడం ఆచారం. శ్రీ అంగ రక్షణ కోసం అవసరమైన ధవళ వర్ణపు వస్త్రాన్ని దెవుళొకొరణొ వర్గం సేవాయత్‌లు ముందు రోజు (ఆదివారం) సిద్ధం చేశారు. ఈ వస్త్రాన్ని దైతపతి వర్గీయులకు అందజేయడంతో రత్న వేదికపై చతుర్థామూర్తుల అంగ రక్షణ కోసం క్రమ పద్ధతిలో చుట్టి సంరక్షించారు. ద్వితీయ భోగ మండపం ముగియడంతో జయ విజయ ద్వారాలను మూసి వేశారు. బెహరణ ద్వారం గుండా దైతపతి సేవాయత్‌లు లోపలికి ప్రవేశించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కాశీబుగ్గ: మందస మండలం చీపి పంచాయతీ రాజపురం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో కాటా మిషన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి వాహనంలో పనిచేస్తున్న వ్యక్తి మరణించాడు. సాబకోట పంచాయతీ భావనపు రం గ్రామానికి చెందిన సవర కామేసు(40) సోమవారం బియ్యం పంపిణీలో మిషన్ చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ పెడుతుండగా షాక్ కొట్టడంతో అక్కడిక్కడే మరణించారు. షాక్ కొట్టిన తర్వాత అతడిని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించి అదే ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడికి భార్య సుభద్ర కుమార్తెలు మౌనిక, జ్యోత్స్న, వర్ధన్‌లు ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుని ఇంట్లో చోరీ

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీస్వేచ్ఛావతి నగర్‌లో గల ఉపాధ్యాయుడు జె.ప్రకాశరావు ఇంటిలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జెడ్పీహెచ్ఎస్ మండపల్లిలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రకాశరావు శ్రీస్వేచ్ఛావ తి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు పిల్లలు విశాఖపట్టణంలో ఇంటర్ చదువుతున్నారు. సెలవు రోజుల్లో ప్రకాశరావు దంపతు లు అక్కడకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం విశాఖపట్టణం వెళ్లి మళ్లీ సోమవారం ఉదయం ఇచ్ఛాపురం ఇంటి వద్ద కు వచ్చేసరికి ఇంటి తలుపులు, వాటి గడియ లు, కిటికీలు విరిగిపోయి కనిపించాయి. ఇంటిలోకి వెళ్లి చూస్తే బీరువా, కప్‌బోర్డులను తెరిచి అందులో ఉన్న సామాన్లు, బట్టలు చిందరవందరగా పడేసి ఉండడం గుర్తించారు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో అవసరానికి తగ్గట్టుగా ఉంచుకొన్న కొంత సొమ్ము రూ.6వేలు, దేవుడికి కట్టిన ముడుపుల సొమ్ములను దుండగులు కాజేసినట్లు ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం సమీపంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటలు సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి డొంక యశ్వంత్‌కుమార్ (32) అనే యువకుడు మృతి చెందాడు. ఇతని భార్య ఇప్పుడు ఏడు నెలల గర్భిణి. ఈ యువకుడు చిలకపాలెం కూడలిలో జాతీయ రహదారి పక్కన ఉన్న తమ మెకానిక్ షెడ్‌కు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో వెళ్లాడు. పని ముగించుకుని చిలకపాలెం గ్రామంలో ఇంటికి వస్తుండగా, రోడ్డు దాటే క్రమంలో శ్రీకాకుళం వైపు వస్తున్న వాహనం జాతీయ రహదారిపై ఢీ కొట్టింది. వాహనం ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. దీంతో రోడ్డుపై పడి ఉన్న యశ్వంత్‌కుమార్‌ను అటుగా వెళ్తున్న వారు గుర్తించి ఎచ్చెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే యశ్వంత్ సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుని అన్న గోపి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి రెండేళ్ల కిందట వివాహం కాగా, భార్య సీతామహాలక్ష్మి ఏడు నెలల గర్భిణి. యశ్వంత్ మృతితో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం సుమండి సమీపంలో జోగపురం, జట్టిపద్ర గ్రామాల కూడలి మలుపు వద్ద మండలంలోని ఎం.తోటూరు గ్రామానికి చెందిన ప్రైవేటు పాఠశాల బస్సు సోమవారం బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ఉండగా.. అంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఉదయం విద్యార్థులను స్కూల్‌కు తీసుకువస్తుండగా కూడలి మలుపులో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. రోజూ వెళ్లే డ్రైవర్ కాకుండా సోమవారం కొత్త డ్రైవర్ పనిచేయడం గమనార్హం. ప్రమాదం సంభవించిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పిల్లలను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ పెద్ద గాయాలు కాలేదని వైద్యులు తెలిపారు.



రాయగడ: ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ మనోజ్ సత్యవాన్



మల్కన్‌గిరి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సచిన్ తదితరులు



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు



పర్లాకిమిడి: దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

గ్రీవెన్స్‌కు విశేష స్పందన

పర్లాకిమిడి: స్థానిక కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్సు హాల్‌లో సోమవారం నిర్వహించిన గ్రామ పరిపాలన మరియు గ్రీవెన్స్ సెల్‌కు విశేష స్పందన లభించింది. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, డీఆర్‌డీఏ, కార్య నిర్వహణ అధికారి గుణనిధి నాయక్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తదితరులు వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్‌కు మొత్తంగా 118 అభియోగాలు రాగా, అందులో వ్యక్తిగత వినతులు 90, వివిధ గ్రామ సమస్యలు 28 ఉన్నాయి. వాటిలో 11 వినతులను అక్కడిక్కడే పరిష్కరించారు. నలుగురికి రూ.10 వేలు చొప్పున రెడ్‌క్రాస్ నిధి నుంచి అందజేశారు. మార్కెట్ వీధిలో ఉంటున్న దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కమలకాంత పండా, గుసాని బీడీవో అజయ్‌కుమార్ ప్రధాన్, సీడీఎంవో డాక్టర్ మహ్మద్ అలీ, తహసీల్దార్ నారాయణ బెహరా తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ సచిన్ పవార్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 23 వినతులు స్వీకరించి, సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. వరదల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నితీష్ వాద్వానీ, అదనపు కలెక్టర్ త్రినాథ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందినవారు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం 90 వినతులను స్వీకరించిన కలెక్టర్ వాటిని పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆరుగురికి, రెడ్‌క్రాస్ నిధుల నుంచి మరో ఇద్దరికి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బీసీ, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ పాల్గొన్నారు.

● రాష్ట్ర ఎంపీలతో పీఎం మోదీ సమావేశం



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలతో ప్రత్యేకంగా సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థితిగతులు, అభివృద్ధి కార్యకలాపాల కోసం సంప్రదించినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జుయెల్ ఓరాం, అశ్విని వైష్ణవ్‌లు పాల్గొన్నారు. - భువనేశ్వర్

కొత్త డీజీపీ నియామకానికి సన్నాహాలు

● పరిశీలనలో ముగ్గురు అధికారులు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నియామకానికి సన్నాహాలు ఊపందుకున్నాయి. పోలీసు శాఖ సర్వోన్నత పదవికి అర్హులైన వారి కోసం పరిశీలన ప్రారంభమైంది. ఈ జాబితాలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు ఉన్నారు. వీరిలో అరుణ్‌కుమార్ రే, ఎస్.ఎం.నర్వానే, యోగేష్ బహదూర్ ఖురానియా ఉన్నారు. ఒడిశా రాష్ట్రానికి డీజీపీ ఎంపికకు ఎంపానెల్‌మెంట్ కమిటీ పరిశీలన కోసం ఈ ముగ్గురి సమాచారంతో బయోడేటాను సమర్పించమని లేఖ రాసింది. ఈనెల 2న కేంద్ర డిప్యూటేషన్‌లో ఉన్న యోగేష్ బహదూర్ ఖురానియా ఒడిశాకు తక్షణమే పంపించాలని కేంద్ర హోమ్ వ్యవహారాల శాఖ ఆమోద పత్రం జారీ చేసింది. దీంతో ఆయన రాష్ట్ర కొత్త డీజీపీగా నియమితులవుతారనే ఊహాగానాలు వ్యాప్తి చెందాయి. తాజాగా ఆయనతో పాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారుల వివరాలను దాఖలు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో రాష్ట్రంలో కొత్త డీజీపీ నియామకంపై ఉత్కంఠ నెలకొంది. 1988 బ్యాచ్ ఐపీఎస్ అరుణ్ కుమార్ రే, 1989 బ్యాచ్ ఐపీఎస్ ఎస్.ఎం. నర్వానే, 1990 బ్యాచ్ ఐపీఎస్ యోగేష్ బహదూర్ ఖురానియా వివరాలు డీజీపీ నియామకం సన్నాహాల్లో పరిశీలనలో ఉన్నాయి.

మాది ప్రజల ప్రభుత్వం



వృద్ధుడి సమస్య వింటున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

● సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: తమది ప్రజల ప్రభుత్వమని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఉద్ఘాటించారు. సోమవారం జరిగిన ప్రజాభియోగాల విచారణ కార్యక్రమం పురస్కరించుకుని ఆయన ఇలా స్పందించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు, ప్రత్యక్షంగా హాజరైన బాధిత వర్గాల అభియోగాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడాతో పాటు పలు శాఖల మంత్రులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి ఉరుములు,మెరుపులతో పాటు వాన కురిసింది. ఉద్దాన తీర ప్రాంతమైన అనకాపల్లి, ఒంకులూరు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. దీంతో ప్రజలు భయంతో వణికిపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంట సాగులకు ఈ వర్షం ఎంతో ఊరట నిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రాప్ నమోదుకు గ్రీన్ సిగ్నల్

- మండలాల్లో శిక్షణ తరగతులు ప్రారంభం
- సెప్టెంబర్ 15 నాటికి పంట నమోదు పూర్తి
- జిల్లాలో 1.82,325 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు



పంటల నమోదు చేస్తున్న వీఏఏ(ఫైల్)

నరసన్నపేట: పంటల నమోదు ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకూ గత ప్రభుత్వం అమలు చేసిన పంటల నమోదు ప్రక్రియను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా.. నూతన పద్ధతులు అమలు చేయనుందా అనే సందిగ్ధంలో వ్యవసాయ శాఖ అధికారులు ఉండే వారు. అయితే గత ప్రభుత్వం అమలు చేసిన పంటల నమోదు(ఈ-క్రాప్) ప్రక్రియనే కొనసాగించి తద్వారా ప్రభుత్వం నుంచి లబ్ధిని రైతులకు అందించేందుకు కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో పంటల విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకొని పంటల నమోదును విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఈ-పంట యాప్‌లో నమోదు చేయనున్నారు. గత ఖరీఫ్‌లో 92 శాతం ఈ-క్రాప్ నమోదు జరిగింది. దీని ఆధారంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లతో పాటు ఇతర పథకాలు అమలు చేసింది.

వన్‌బీ, ఆధార్ జిరాక్స్‌లు ఇవ్వాలి..

రైతులు రైతు సేవా కేంద్రాలకు వన్‌బీ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఫోను నంబరు తీసుకొని వెళ్లి ఏ పంట వేశారో దాన్ని నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అమలు కావని హెచ్చరిస్తున్నారు. శనివారమే ప్రక్రియ మొదలు కాగా.. సెప్టెంబర్ 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం తేదీని ప్రకటించింది. జిల్లాలోని 30 మండలాల్లో 2024 ఖరీఫ్‌కు 1.82,325 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తితో పాటు ఇతర రకాలు పండించే అవకాశం ఉంది. మరో 15 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా వరి ఉభాలు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. సెప్టెంబర్ 15 కల్లా పంట నమోదు పూర్తి చేసి 19 నుంచి రైతు సేవా కేంద్రాల వారీగా సామాజిక తనిఖీలు(సోషల్ ఆడిట్) చేపట్టనున్నారు. గ్రామ సభల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు పెట్టి వచ్చిన అబ్యంతరాలు 25 నుంచి 29 వరకూ పరిష్కారం చేస్తారు. సెప్టెంబర్ 30న ఈ-క్రాప్ తుది ముసాయిదాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ తెలిపారు.

- అగ్రస్థానంలో ఖుర్దారోడ్ మండలం
- 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా

రికార్డు స్థాయి సరుకు రవాణా

భువనేశ్వర్:

సరుకు రవాణాలో తూర్పు కోస్తా రైల్వే దూసుకుపోతోంది. ఈ జోన్‌లో ఖుర్దా రోడ్ మండలం కృషితో ఇది సాధ్యమవుతోంది. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరంలో ఈనెల ఒకటో తేదీ నాటికి ఖుర్దారోడ్ మండలం సమగ్రంగా 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి అగ్రస్థానంలో నిలిచింది. భారతీయ రైల్వేలో తూర్పుకోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసిన తొలి మండలంగా గుర్తింపు సొంతం చేసుకుంది. కొత్త ఆర్థిక సంవత్సరం తొలి 123 రోజుల్లో భారీ స్థాయిలో సరుకు రవాణా (ఎగుమతి, దిగుమతి) చరిత్రలో సరికొత్త మైలురాయిని ఆవిష్కరించిందని ఖుర్దారోడ్ మండల రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. గతేడాది ఈ వ్యవధిలో సరుకు రవాణాతో పోలిస్తే 6 శాతం అధికం కావడం విశేషం. ఈ ఏడాది జూలై నెలలో ఖుర్దారోడ్ డివిజన్ సరుకు రవాణాలో అద్భుతమైన వృద్ధి సాధించింది. అత్యధికంగా 13.69 మిలియన్ టన్నుల సరుకు ఎగుమతి చేయగా, 11.6 మిలియన్ టన్నుల సరుకును దిగుమతి చేసుకుంది. ఇది గతేడాది జూలై కంటే సగటున 9 శాతంగా అధికంగా తేలింది. జూలై నెలలో ఎగుమతి రంగంలో 8 శాతం మరియు దిగుమతి చేయడంలో 10 శాతం ఆధిక్యత సాధించింది. సరుకు రవాణాలో తాల్చేర్, పారాదీప్, ధామ్రా, నయాగఢ్, మెరామండలి, సుకింద ప్రాంతాల్లో ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రాంతాల నుంచి బొగ్గు, ఇనుప ఖనిజం, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు, ముడి పదార్థాలు దేశవ్యాప్తంగా పరిశ్రమలు, వివిధ రకాల ఉత్పాదన కంపెనీలు, పలు విద్యుత్ సంస్థలు, ఇతరేతర ఉత్పత్తి యూనిట్లకు సరుకు రవాణా చేశారు. ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్.బజ్వా ఆధ్వర్యంలో అధికారులు మరియు సిబ్బంది సమష్టి కృషితో సాధ్యమైనట్లు పేర్కొన్నారు.

● భక్తిశ్రద్ధలతో పూజలు

శ్రావణ మాసం సోమవారం పురస్కరించుకుని రాష్ట్రంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహా శివుడిని పవిత్ర నదీ జలాలతో అభిషేకించేందుకు వేకువజాము నుంచి శివాలయాల ప్రాంగణాల్లో బారులుతీరారు. భువనేశ్వర్ లింగరాజ్ దేవాలయం, పూరీలోని లోక్‌నాథ్ దేవాలయం, ఢెంకనాల్ కపిలాస్ ఆలయం, కటక్‌లోని ధవళేశ్వర్ ఆలయం, భద్రక్ అరొడి అఖండల మణి, నయాగడ్ లడూబాబా, గుప్తేశ్వర్‌లో శివక్షేత్రం తదితర ఆలయాల వద్దకు పెద్ద ఎత్తున భోల్ భం భక్తులు చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పాదయాత్రతో తీసుకొచ్చిన నదీ జలాలతో అభిషేకించి తరించారు. గవర్నర్ రఘుబర దాస్ స్థానిక ఏకామ్ర క్షేత్రవాసుడు లింగరాజు మహాప్రభువుకు శుద్ధ జలంతో అభిషేకించారు. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: పూజలందుకుంటున్న గుప్తేశ్వరుడు



భువనేశ్వర్: మహా దేవుడిని అభిషేకించేందుకు కలశంతో వెళ్తున్న గవర్నర్ రఘుబర్ దాస్



భువనేశ్వర్: లింగరాజు మహా ప్రభువుకు జలాభిషేకం చేస్తున్న గవర్నర్ రఘుబర దాస్.



జయపురం: బోల్‌భం కావిడిలతో చిన్నారులు



జయపురం: గుప్తేశ్వర్‌కు పోటెత్తిన భక్తులు



భువనేశ్వర్: అభిషేకం కోసం బారులుతీరిన బోల్ భమ్ భక్తులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని పతివాడపాలెం జాతీయ రహదారి పై ఓవర్ వంతెనపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందారు. మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పతివాడపాలెం ఫ్లై ఓవర్‌పైన సోమవారం తెల్లవారు జామున 3గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వాహనం ఢీకొని చనిపోయాడు. తెల్లవారేంత వరకు ఈ ప్రమాదాన్ని ఎవరూ గమనించలేదు. మృతుడి వయసు 40–45 ఏళ్లు ఉంటుంది. ఎడమ చేతి మోచేయిపై నాగీసు- రూప అనే పచ్చబొట్టు ఉంది. ఎడమ పక్క ఛాతీపై అమ్మ అనే పచ్చబొట్టు ఉంది. కుడి మోచేయిపై రూప అనే పచ్చబొట్టు ఉంది. మెడలో నల్లని తాడుతో రుద్రాక్ష ఉంది. ఇతని వివరాలు ఎవరికైనా తెలిస్తే జేఆర్ పురం ఎస్ఐ నంబర్ 6309990850ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జే.ఆర్.పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

ముఖలింగేశ్వరుని సన్నిధిలో శివస్వాములు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి శివస్వాములు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి సోమవారం కావడంతో ఒడిశా, చత్తీస్‌గఢ్‌కు చెందిన శివస్వాములు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఒడిశా రాష్ట్రం బరంపురం, పర్లాఖిముండీ, గంజాం జిల్లా సత్రపూర్, బోగినిపేట, మండవానిపేట, భువనేశ్వర్ నుంచి వచ్చిన శివ స్వాములు ముందుగా వంశధార నదిలో స్నానాలు చేసి గణపతి పూజతో పూజలు ప్రారంభించారు. స్వామికి ఏకవారాభిషేకాలు, దర్శనాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే ఆలయ గర్భ గుడిలో ఉన్న గోలెంకకు మొక్కి అనంతరం వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

విజిలెన్స్ వలలో చీఫ్ ఇంజినీర్

● భారీగా అక్రమాస్తుల గుర్తింపు

భువనేశ్వర్:

ఒడిశా వంతెన నిర్మాణ సంస్థ (ఓబీసీ సీ) కటక్ సర్కిల్ అదనపు చీఫ్ ఇంజినీర్ ప్రదీప్ కు మార్‌రథ్ అక్రమ ఆస్తులపై ఒడిశా విజిలెన్స్ సోమ వారం సోదాలు చేపట్టింది. 9 మంది డీఎస్పీలు, 11 మంది ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో విజిలెన్స్ బృందాలు ఏకకాలంలో భువనేశ్వర్, కటక్, భద్రక్, జాజ్‌పూర్, ఖుర్దా ప్రాంతాల్లో 12 చోట్ల సోదాలు నిర్వహించాయి. దీనిలో భాగంగా నగరంలో 1 బహుళ అంతస్తుల భవనం, 2 విలాసవంతమైన ఫ్లాట్లు, 1 ఔషధ దుకాణం గుర్తించారు. వీటితో పాటు మరో బహుళ అంతస్తుల భవనం, క్రషర్ యూనిట్, 42 ఇండ్ల స్థలాలు, రూ.88 లక్షల విలువైన డిపాజిట్లు, విలాసవంతమైన నాలుగు చక్రాల వాహనం, 2 జేసీబీలు, ఒక ఎక్స్‌కవేటర్‌ను అక్రమార్జనగా గుర్తించారు.

బయటపడిన ఆస్తుల వివరాలు

సత్య విహార్, పండరా, భువనేశ్వర్‌లో మూడు అంతస్తుల భవనం, భద్రక్ పట్టణంలో ఒక రెసిడెన్సియల్ మూడు అంతస్తుల భవనం గుర్తించారు. భువనేశ్వర్ చంద్రశేఖర్‌పూర్‌లో ఓస్టెర్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్, భువనేశ్వర్ పాత్రపడా ప్రాంతంలో ఒక ఫ్లాట్, ఢెంకనాల్‌లో ఒక క్రషర్ యూనిట్, భువనేశ్వర్ నయాపల్లి ఇంద్రధను మార్కెట్ సముదాయంలో 1000 చదరపు అడుగుల విస్తీర్ణపు ఒక ఔషధ దుకాణం-కమ్-రెసిడెన్స్ ఉన్నట్లు నిర్ధారించారు. 42 ఇండ్ల స్థలాలు (భువనేశ్వర్‌లో మూడు, ఖుర్దాలో ఒకటి, కటక్, భద్రక్ మరియు ఢెంకనాల్‌లో 2 చొప్పున 6 మరియు జాజ్‌పూర్‌లో 32), రూ.88 లక్షల విలువైన వివిధ బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 1 ఫోర్ వీలర్ (ఎకో స్పోర్ట్స్), 2 జేసీబీలు, 1 ఎక్స్‌కవేటర్, 2 టూ వీలర్స్ ఉన్నాయి. ఆస్తులను ప్రదీప్‌కుమార్ తన పేరుతో పాటు కుటుంబ సభ్యుల పేరుతో వేర్వేరు సంవత్సరాల్లో కొనుగోలు చేసినట్లు సోదాల్లో తేలింది. వీటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ విలువ రూ.1.05 కోట్లకు పైబడి ఉంది. కాగా పలుచోట్ల ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి.



సోదాల్లో బయటపడుతున్న నగలు, ఆభరణాలు



నగరంలోని ఒక బహుళ అంతస్తు భవనం

క్లుప్తంగా

10న వెయిట్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు అనకాపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాయ్స్, గర్ల్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 10న కొండవెలగాడలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు బెల్లాన లక్ష్మి, నరేంద్ర, చల్లా రాము తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ..కొండవెలగాడలోని సీనియర్ కోచ్ చల్లా రాము వెయిట్ లిఫ్టింగ్ కేంద్రం వద్ద ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డుతో పాటు ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఐడీ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9490949759 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సాహిత్య ఉత్సవాలకు ఆహ్వానం



యువ రచయిత గౌరినాయుడు

లక్కవరపుకోట: బెంగళూరులో ఆగస్టు19వ తేదీ నుంచి జరగనున్న సాహితీవేత్తల సమ్మేళనంలో పాల్గొనాలని తనకు ఆహ్వానం అందినట్లు మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ రచయిత, సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరినాయుడు సోమవారం తెలిపారు. సాహిత్య ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాహితీవేత్తల సమ్మేళనంలో పాల్గొని సాహిత్యం-సమాజం-యువత అనే అంశంపై ప్రసంగిస్తానని ఆయన చెప్పారు. అలాగే ప్రచురణ కర్తల ప్రతినిధుల సదస్సులో పాల్గొని కళాకేళి ప్రచరణ సంస్థ తరఫున ప్రతినిధిగా పాల్గొని పత్ర సమర్పణ చేస్తానన్నారు. సోమసుందర్ లిటరరీ ట్రస్టు కో ఆర్డినేటర్‌గా, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా సాహితీ రంగానికి తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అరుదైన అవకాశం లభించినట్లు వివరించారు. ఈ సందర్భంగా గౌరినాయుడికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తామని తహసీల్దార్ టి.గోవింద అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూమి కౌలుకు ఇచ్చిన యజమానుల అనుమతితో కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్డుల వల్ల ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్ వర్క్‌షాపు ప్రారంభం



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్ బెంగళూర్ సంస్థ సంయక్త నిర్వహణలో విద్యార్థులకు నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవ మణి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పి.సురేష్, ఎస్.షణ్ముఖరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ కార్యక్రమం మంచి అవకాశమన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, అడాప్టబిలిటీ, గ్రూమింగ్, బాడీ లాంగ్వేజ్, ఇంటర్వ్యూ ఎలా ఎదుర్కొనాలి వంటి వాటిపై శిక్షణ ఉంటుందని చెప్పారు. చివరగా జాబ్‌డ్రైవ్ కూడా ఉంటుందని, విద్యార్థులు శతశాతం హాజరై స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి కో ఆర్డినేటర్ తరుణ్ పట్నాయక్, ఉన్నతి ఫౌండేషన్ ట్రయినర్లు ప్రత్యూష, శాంతిలత, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి బి.సూరపునాయుడు, ఎస్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓతోపాటు ఆర్డీఓ కె.హేమలత ప్రజల నుంచి సామాజిక, వ్యక్తిగత అంశాలపై 148 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్వాసితుల స్థలం కబ్జా

శ్రీకాకుళం వెళ్లే రోడ్డును ఆనుకుని ఉన్న మిత్ర రియల్ ఎస్టేట్ యాజమాన్యం బంటువానివలస గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. గ్రామం నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు కూడా బయటకు వెళ్లకుండా మట్టి వేసి అడ్డుకుంటుండడమే కాకుండా తోటపల్లి నిర్వాసితులకు కేటాయించిన స్థలాన్ని కూడా కబ్జా చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ స్థలాలను అక్రమంగా విక్రయిస్తున్నారు. తోటపల్లి రిజర్వాయర్ కోసం సర్వం కోల్పోయిన తమకు, గ్రామానికి జరుగుతున్న అన్యాయాన్ని, మిత్ర రియల్ ఎస్టేట్ యాజమాన్యం చేస్తున్న భూ కబ్జాతోపాటు అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి తగున్యాయం చేయాలని బంటువానివలస గ్రామానికి చెందిన పి.సీతంనాయుడు తదితరులు అర్జీ అందజేశారు.



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కేశవనాయుడు

ఎస్పీ కార్యాలయానికి 8 ఫిర్యాదులు

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధితులు 8 ఫిర్యాదులు అందజేశారు. ఈ మేరకు జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా అదనపు ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సై గోవింద రావు, సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

సీతంపేట: ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీతంపేట ఐటీడీఏలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజాసమాఖ్య నాయకులు ఎస్.చిరంజీవి, ఎస్.మోహన్‌పాల్ తదితరులు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ఏపీవో ఎస్‌వీ గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకలు, గొర్రెల యూనిట్‌లు పెట్టుకోవడానికి రుణాలు మంజూరు చేయాలని, కొండపోడు పట్టాలు ఇప్పించాలని పలువురు గిరిజనులు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో పి.నారాయుడు, సీడీపీవో రంగలక్ష్మి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ అనిత

- ప్రజా వినతుల పరిష్కార వేదికకు 265 అర్జీలు

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు అధిక సంఖ్యలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే ఈ వారం కూడా వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అందిన మొత్తం 265 అర్జీలలో భూ సమస్యలకు సంబంధించి 130 వినతులు ఉన్నాయి. తరువాత స్థానంలో డీఆర్‌డీఏకు సంబంధించిన పింఛన్ల అర్జీలు 87 ఉన్నాయి. ఇంకా విద్యాశాఖ, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ, హౌసింగ్‌కు, పంచాయతీ రాజ్ శాఖ, గ్రామ వార్డు సచివాలయాలు, వైద్యారోగ్య శాఖ, డీసీహెచ్ఎస్‌కు మిగిలిన వినతులు ఉన్నాయి. ఈ వినతులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీఆర్‌ఓ కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్స్ మురళీకృష్ణ, సుమబాల వినతులు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికలో 29 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి 35 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్సైలు మురళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

గిరిజన విద్యార్థులా.. వంట మనుషులా?

- గిరిజన విద్యార్థులతో వంటలు చేయించడం అత్యంత దురదృష్టకరం
- పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలి
- విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులతో వంటలు చేయించడం దురదృష్టకరమని, వారు విద్యార్థులా.. వంట మనుషులా? అని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం, సీతంపేటలోని గిరిజన విద్యార్థులతో వంట పనులు చేయిస్తున్న ఘటనలపై ఆయన తీవ్రంగా స్పందించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో మీడియాతో సోమవారం మాట్లాడారు. బంగారు భవిష్యత్ ఉంటుందన్న ఆశతో పాఠశాలలకు వస్తున్న విద్యార్థులతో వంట పనులు చేయించడం విచారకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిచ్చిందని, నాడు-నేడు కింద పాఠశాలలకు సకల సదుపాయాలు కల్పించిందని, అమ్మఒడి, విద్యాకానుక, ఆణిముత్యాలు, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలతో పేద కుటుంబాల విద్యార్థులు చక్కగా చదువుకునేలా ప్రోత్సహించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే తల్లికి వందనం కింద ఆర్థిక లబ్ధి కల్పించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, నిలిచిన వసతి భవనాల నిర్మాణ పనులు పూర్తిచేయించి, పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

భగవద్గీత మోక్ష ప్రదాయిని

రేగిడి: భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో గొర్లె దామోదర రావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీతను పఠిస్తే చెడుగీతలు చెరిగిపోతాయన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ పని ఒత్తిడిలో పడి మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత సారాంశం తెలియజేస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

ఘనంగా గిరిజన యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్:

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఆరవ వ్యవస్థాపక దినోత్సవాలు సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. తొలుత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీసీ మాట్లాడుతూ ఐదు వసంతాలను పూర్తి చేసుకున్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం ఎన్నో మైలు రాళ్లను దాటి మరెన్నో పరిశోధనాత్మకమైన విద్యాపరమైన విజయాలను చవి చూసిందని చెప్పారు. చాలా ఒడిదుడుకులు, సవాళ్లను ఎదుర్కొని ఆరవ వసంతంలోకి రావడం సంతోషంగా ఉందని, యూనివర్సిటీ అభివృద్ధిపథంలో నడవాలంటే మంచి బోధన సిబ్బంది, ల్యాబొరేటరీలు, హాస్టల్స్, ఆటస్థలం, తదితరాలు ఉండాలని వాటి కోసం కృషిచేస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ యూనివర్సిటీని ఏ ఉద్దేశంతో స్థాపించారో? ఏ విధంగా అభివృద్ధి చెందిందో? రాబోయే రోజుల్లో చేపట్టబోయే వివిధ పరిశోధనలు, విద్య, ఉద్యోగ, ఉపాధి కోర్సుల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు శరత్చంద్రబాబు, జితేంద్రమోహన్ మిశ్రా, చైర్మన్ డాక్టర్ అనిరుధ్ కుమార్, డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రమా, ఏఓ డాక్టర్ ఎన్‌వీసూర్య నారాయణ, డాక్టర్ గంగునాయుడు మండల తదితర అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి

రాజాం సిటీ: ఈ నెల 1వ తేదీన రాజాం మండలంలోని తోకలవలస గ్రామ సచివాలయంలో చొరబడి 16 సెల్‌ఫోన్లు దొంగిలించిన ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శాసపు సంతోష్ కర్నాటక రాష్ట్రంలో బొంతలకుట్టే పని చేసేవాడు. బుడితి రాంబాబు గ్రామంలోనే ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బొంతల క్యాంపు నుంచి గ్రామానికి చేరుకున్న సంతోష్, గ్రామంలో ఉంటున్న రాంబాబుతో పాత స్నేహాన్ని కొనసాగించాడు. అలా కొంతకాలం వారిద్దరూ ఊరిలోనే ఖాళీగా ఉంటున్నారు. దీంతోపాటు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. ఆగస్టు నెలకు సంబంధించి ప్రభుత్వం సచివాలయాలకు అందించిన పింఛన్ సొమ్ము సచివాలయంలో ఉంటుందని భావించారు. అదే అదునుగా గత నెల 31న సచివాలయం వద్ద రెక్కీ నిర్వహించి సాయంత్రం 5.30 గంటల నుంచి ఆగస్టు 1 ఉదయం 10.30గంటల మధ్యలో సచివాలయంలో చొరబడ్డారు. సచివాలయంలో నగదు లేకపోవడంతో ప్రభుత్వం సరఫరా చేసిన 16 మొబైల్ ఫోన్లతో పాటు ఒక లామినేషన్ మెషీన్‌ను దొంగిలించారు. ఈ నెల 1న పింఛన్ సొమ్ము పంచేందుకు వెళ్లిన సచివాలయ సిబ్బంది తిరిగి ఉదయం 10.30గంటల సమయంలో కార్యాలయానికి చేరుకుని ఫోన్లు, లామినేషన్ మిషన్ లేకపోవడాన్ని గుర్తించి సచివాయ కార్యదర్శి దన్నాన రాకేష్‌కుమార్ దొంగతనం జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై ఇ.శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని సచివాలయంలో పరిశీలించారు. అనుమానితుల నుంచి వేలిముద్రలు సేకరించి కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి గ్రామానికి చెందిన సంతోష్, రాంబాబులను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి తక్కువ సమయంలో నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎస్.శ్రీనివాసరావు, ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి. వెనుక ముసుగులో నిందితులు

అనుమతి లేకుండా ఆశ్రమాలు

- జిల్లాలో 18 హోమ్స్‌కు మాత్రమే అనుమతి
- అనుమతి లేకుండా మరిన్ని నిర్వహణ
- చిల్డ్రన్‌హోమ్స్‌పై పర్యవేక్షణ కరువు..!

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలంలోని కరకవలసలో ఉన్న ప్రేమ వెలుగు ఆశ్రమ సంస్థ 46 మంది పిల్లలతో ఆశ్రమం నిర్వహించేది. ఈనెల 30వతేదీన రాత్రి హోంలో వండిన బిర్యానీ తినడం వల్ల 21 మంది పిల్లలు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరారు. అధికారుల పరిశీలనలో ఈ ఆశ్రమానికి ఎటువంటి అనుమతులు లేవని తేలింది. అంతేకాకుండా పిల్లలకు అవసరమైన కనీస వసతులు కూడా లేనట్లు గుర్తించారు.

చిల్డ్రన్‌హోమ్స్ (బాలల ఆశ్రమాలు)పై పర్యవేక్షణ కొరవడుతోంది. హోమ్స్‌లో పిల్లలకు కల్పించాల్సిన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని పర్యవేక్షించాలి. అదేవిధంగా అనుమతులు ఇచ్చేటప్పుడు పిల్లలు ఉండడానికి అవసరమైన వసతులు ఉన్నాయా లేదా అని పరిశీలించిన మీదట ఇవ్వాలి. కానీ ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హోమ్స్‌లో వసతులు లేకపోతే అందులో ఉండే పిల్లలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఏదైనా అనారోగ్యం గురైతే దానికి బాధ్యత ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది

జిల్లాలో 18 హోమ్స్‌కు అనుమతులు

జిల్లాలో 18 చిల్డ్రన్ హోమ్స్‌కు మాత్రం పూర్తిస్థాయిలో అనుమతులు ఉన్నాయి. రెయిన్ బో, శాంతి నివాస్, బాలసదన్, న్యూ హోప్ రూరల్ లెప్రసీ ట్రస్ట్, సన్‌రైజ్ చిల్డ్రన్ హోమ్, పవిత్ర ఆత్మ నిలయం, హంగరీపీపుల్ ఫర్ బాయ్స్/గరల్స్ తదితర హోమ్స్ ఉన్నాయి. వాటిలో ఐదు ప్రభుత్వ అధీనంలో నిర్వహించే హోమ్స్ ఉన్నాయి. మిగతా 13 హోమ్స్ స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

హోమ్ నిర్వహణకు అనుమతి తప్పనిసరి

హోమ్ నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. హోమ్‌కు అనుమతిని డిస్ట్రిక్ట్ లెవెల్ అప్రూవల్ కమిటీ ఇస్తుంది. కలెక్టర్, జిల్లా ప్రొహిబిషన్ అధికారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులతో కూడిన కమిటీ హోమ్స్‌కు అనుమతి మంజూరు చేస్తుంది. హోమ్స్ పరిశీలించి పూర్తిస్థాయిలో సౌకర్యాలు, వసతులు ఉన్నాయని నిర్ధారించుకున్న మీదట మాత్రమే అనుమతి ఇస్తారు. అనాథ పిల్లలతో నిర్వహించే ప్రతి హోమ్‌కు అనుమతి తప్పనిసరి.

గతంలో జిల్లాలో 50 హోమ్స్

జిల్లాలో 50 హోమ్స్ గతంలో ఉండేవి. వాటిలో 18హోమ్స్ మాత్రమే అనుమతులు తీసుకున్నాయి. 32 హోమ్స్ లైసెన్స్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోలేదు. అయితే ఆ హోమ్స్ నిర్వహణలో ఉన్నాయా? లేదా మూసివేశారా? అన్న తేలాల్సి ఉంది. హోమ్స్ మూసివేస్తే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోనవసరం లేదు. కానీ కొంతమంది లైసెన్స్ లేకుండా హోమ్స్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కరకవలస హోమ్‌లో పిల్లలు ఉండే గదిలో గుట్టగా వేసిన కర్రలు

3 నెలలకు ఒకసారి హోమ్స్ పరిశీలన

బాలల సంరక్షణ అధికారులు హోమ్స్‌ను 3 నెలలకు ఒకసారి పర్యవేక్షణ చేయాల్సి ఉంది. కానీ అది సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హోమ్స్ లైసెన్స్ రెన్యువల్ చేసుకుంటున్నాయా? లేదా? పిల్లలు ఎంతమంది ఉన్నారు? వారికి సరిపడ వసతులు ఉన్నాయా? లేదా? అని పరిశీలించాల్సి ఉంది. లైసెన్స్ లేకుండా హోమ్ నిర్వహిస్తే అటువంటి హోమ్‌ను మూసి వేయడానికి అవసరమైన ఉత్తర్వుల కోసం అప్రూవల్ కమిటీకి సిఫార్సు చేయాలి జిల్లాలో అనుమతి తీసుకున్న హోమ్స్ 18 ఉన్నాయి. 32 హోమ్స్ హోమ్స్ నిర్వహించలేమని రాసి ఇచ్చారు. రాసి ఇచ్చిన తర్వాత హోమ్ నిర్వహించినట్లయితే చర్యలు తీసుకుంటాం. వాటిని కూడా ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం. ఇకపై కూడా చేస్తాం. అనుమతులు లేకుండా హోమ్స్ నిర్వహించకూడదు. అనుమతులు లేకుండా హోమ్స్ నిర్వహించినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటాం.

యార్ల నాగరాజు,
జిల్లా బాలల సంరక్షణ అధికారి

అమ్మ హుండీలో అమెరికా కరెన్సీ



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు తదితరులు



లెక్కింపులో బయటపడిన డాలర్లు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు ఆలయ హుండీల ఆదాయం లెక్కింపులో మూడు యూఎస్‌ఏ డాలర్లు లభ్యమయ్యాయి. స్థానిక పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపంలో సోమవారం చదురుగుడి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు మాట్లాడుతూ 25 రోజులకు గాను చదురుగుడి హుండీల ద్వారా రూ.7 లక్షల 78 వేల 949 నగదు, 19 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి, మూడు యూఎస్‌ఏ డాలర్లు లభించాయని వివరించారు. కార్యక్రమంలో రామతీర్థం దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావుతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని భోగాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల కఠినకారాగారం, జరిమానాను న్యాయస్థానం విధించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసుకు సంబంధింన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా మునపాక మండలానికి చెందిన ఓ యువతి భోగాపురం మండలంలోని మహారాణిపేట వద్దనున్న కళాశాలలో బి.ఫార్మసీ చదువుతూ, స్నేహితులతో కలిసి ఒక గది అద్దెకు తీసుకుని ఉంటుండగా, ఆమెకు ఫేస్‌బుక్ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన పడగ సాయి మనోజ్ కుమార్ పరిచయమయ్యాడు. దీంతో తరచూ ఇద్దరూ కలిసేవారు. మనోజ్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా, అనుభవించి, తర్వాత పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలైన విద్యార్థిని భోగాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేచగా అప్పటి డీఎస్పీలు బి.మోహనరావు, పి.వీరాంజనేయరెడ్డిలు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా భోగాపురం సీఐ పి.రవికుమార్ చర్యలు చేపట్టగా, నిందితుడు మనోజ్ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి 20 సంవత్సరాలు కఠినకారాగారం, రూ. 5,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసులో ముద్దాయికి శిక్షపడేలా వాదనలు వినిపించిన స్పెషల్ పీపీ మావూరి శంకరరావు, ఇతర పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు.